క్లుప్తంగా

జనావాసాల్లో భారీ కొండచిలువ



కొండచిలువతో స్నేక్ క్యాచర్ అనిల్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో గల ఓ ఇంటి ఆవరణలో మంగళవారం రాత్రి ఆరడుగుల పొడవు, 30 కిలోల బరువున్న కొండచిలువ కనిపించింది. భయాందోళనలకు గురైన కుటుంబసభ్యులు వెంటనే శాంతినగర్‌లో నివాసం ఉంటున్న స్నేక్ క్యాచర్ గిరిగంటి అనిల్‌కు సమాచారం అందించగా చాకచక్యంగా పామును బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి హాని కలుగనీయకుండా అటవీప్రాంతంలో వదిలి పెట్టినట్లు అనిల్ పేర్కొన్నారు.

గోదారంగనాథులకు ప్రత్యేక హారతి



హారతి ఇస్తున్న మహిళలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని బాగులవాడ వాల్మీకి నగర్‌లో గల రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బుధవారం గోదారంగనాథులకు ప్రత్యేక మంగళ హారతుల కార్యక్రమం చేపట్టారు. ఆలయ పూజారి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఇందిరమ్మ' సర్వే పరిశీలన



సూపర్ చెక్ చేస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో రాధ బుధవారం సూపర్ చెక్ చేశారు. ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సర్వేను ఆమె స్వయంగా వెళ్లి సూపర్ చెక్ చేశారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుని లిస్టులో పేర్లు రానివారి జాబితా తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాలని కార్యదర్శులకు సూచించారు.

'సాహితీ కేంద్రంగా నిర్మల్'

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సాహితీ వైభవంలోనూ చారిత్రక ఖ్యాతిని గడిచిందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో కొనసాగుతున్న నిర్మల్ ఉత్సవాల్లో మంగళవారం రాత్రి జిల్లాకు చెందిన యువకవి, కళాకారుడు పోలీస్ భీమేశ్ రచించిన 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవిత సంపుటి గ్రంథాన్ని మాజీ మంత్రి ఐకేరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. కవితా సంపుటికి రాష్ట్రస్థాయి యువ పురస్కారాన్ని పొందిన పోలీస్ భీమేశ్‌ను ప్రశంసించారు. అలాగే డాక్టర్ సంపత్‌కుమార్‌రెడ్డి రచించిన 'గంగదర్వాజా–తెలంగాణ సంస్కృతి, మురిపాల ముచ్చట్లు' పుస్తకాన్ని ఆవిష్కరించగా, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, కవులు దేవరావు, భీమేశ్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్ (జి): మండలంలోని అంజనీతండా గ్రామానికి చెందిన జాదవ్ శ్రీనివాస్ (44) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ శ్రీనివాస్ అనారోగ్యానికి గురై రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు వినేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో గుడిసె రాజేందర్ మాతృమూర్తి భారతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు నరేష్‌రెడ్డి, నగేష్, కొట్టే శేఖర్, రవి ఉన్నారు.

డ్రాగన్ పండుతోంది



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువరైతు కదం శివరాజ్. దిలావార్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఇతను డిగ్రీ వరకు చదువుకున్నాడు. విద్యను అభ్యసించే సమయంలో తన మిత్రులతో కలిసి రెండేళ్ల క్రితం ఓ టూరుకు వెళ్లాడు. అక్కడ డ్రాగన్ ఫ్రూట్ సాగును గమనించాడు. ఎలాగైనా తను కూడా ఇతర రైతులకు భిన్నంగా జిల్లాలో సాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో చర్చించాడు. ఒప్పుకోవడంతో తమకున్న మూడు ఎకరాలలో ఆయిల్‌పాం, ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్, మిగిలిన రెండు ఎకరాలలో ఇతర పంటలు సాగు చేస్తున్నాడు.

- వినూత్న పంట సాగు చేస్తున్న రైతులు
- జిల్లాలో పదెకరాల్లో సాగు



దిలావర్‌పూర్ వద్ద సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ పంట

లక్ష్మణచాంద: జిల్లాలోని రైతులు పురాతన పద్ధతిలో ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా ఆధునికతను అందిపుచ్చుకుని నూతన పంటల సాగువైపు అడుగులు వేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సౌత్ మెక్సికో, సెంట్రల్ అమెరికా వంటి దేశాల్లోనే సాగయ్యేది. అందులో పోషక విలువలు ఎక్కువగా ఉండడంతో నేడు ప్రపంచ వ్యాప్తంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. మనదేశంలో కూడా నీటి లభ్యత తక్కువగా ఉన్న ఎడారి రాష్ట్రాలలో పండించేవారు. కొన్నేళ్ల క్రితం వరకు డ్రాగన్ ఫ్రూట్ కొనాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పలువురు యువ రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో రహదారుల పక్కల ఈ ఫలం లభిస్తోంది.

10.22 ఎకరాల్లో సాగు

జిల్లాలో 10.22 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగవుతున్నట్లు హార్టికల్చర్ అధికారులు తెలిపారు. ఇందులో బాసరలో 5 ఎకరాలు, దిలావార్‌పూర్ మండలంలోని న్యూలోలంలో 0.5 గుంటలు, కాల్వ గ్రామంలో 1.33 ఎకరాలు, దిలావార్‌పూర్‌లో 2.24 ఎకరాలు, నిర్మల్ రూరల్ మండలంలోని మూటాపూర్‌లో ఎకరం చొప్పున సాగవుతున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.వి.రమణ తెలిపారు. సాగుకు అవసరమైన మొక్కలు స్థానికంగా లభించకపోవడంతో జిల్లాలోని పలువురు రైతులు సంగారెడ్డి నుంచి తెప్పించుకుని సాగు చేస్తున్నారు.

ఎకరంలో సాగు ఖర్చులు ఇలా....

ఎకరంలో 2వేల మొక్కలు నాటవచ్చు. ఒక్కో మొక్కకు రూ.80 చొప్పున రూ.1,60,000 అవుతుంది. ఒక్కో పోల్‌కు రూ.350 చొప్పున 500ల పోల్స్‌కు రూ.1,75,000 అవుతాయని రైతులు తెలిపారు. తోటను సాగు చేయడానికి అలాగే మొక్కలు నాటడానికి, భూమిని బెడ్ పద్ధతిలో తయారు చేయడానికి మొత్తంగా రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

బెడ్ పద్ధతిలో సాగు...

డ్రాగన్ ఫ్రూట్ పంటను ఇతర పంటల వలె కాకుండా బెడ్ పద్ధతిని అవలంబిస్తున్నారు. బెడ్ పైన ఒక్కో మొక్కకు సమాన దూరం పాటిస్తూ ఎకరంలో 500 రాతి పోల్స్ వేయడం జరిగింది. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో నీటిని అందజేస్తున్నారు. సూర్యరశ్మి ఎక్కువగా అందేలాగా పంటను సాగు చేసుకోవాలని రైతులు అంటున్నారు.

అడవి జంతువుల బెడద లేదు

రైతులు ఏ పంటలు సాగు చేసినా అడవి జంతువుల నుంచి పంటలను రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతుంటారు. కానీ డ్రాగన్ ఫ్రూట్ పంట మొక్కల పైన, ఫలాల పైన మొత్తం ముళ్ళు ఉండడంతో పంటచేలలోకి పందులు, కోతులు ఇతర జంతువులు ఏవీ రావని రైతులు పేర్కొంటున్నారు.

పోషకాల స్టోర్

డ్రాగన్ ఫ్రూట్‌ను పోషకాల స్టోర్ అనే పేరుతో పిలుస్తారని వైద్యులు పేర్కొంటున్నారు. మన శరీరానికి శక్తినిచ్చే ఫైబర్, క్యాల్షియం, ఐరన్, పాస్పరస్, వంటి మినరల్స్ మెండుగా ఉంటాయి. వీటితో పాటు బి1,బి2,బి3,, విటమిన్లు ఉంటాయి.

రైతులు ముందుకు రావాలి

> జిల్లాలోని అన్ని మండలాలు డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు అనుకూలం. డ్రాగన్ ఫ్రూట్ ఎడారి మొక్క కావడంతో తక్కువ నీటితో పంటను సాగు చేయవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు పంట సాగుకు ముందుకు రావాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది.
>
> – బీవీ.రమణ, జిల్లా ఉద్యానవన అధికారి

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



ముధోల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం బ్రహ్మణ్‌గవ్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, నాయకులు తాటివార్ రమేశ్, ధర్మపురి శ్రీనివాస్, బాలు, గడ్డం అనిల్, కసారం శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు రవి కిరణ్‌గౌడ్, దత్తురాం చందర్, నిమ్మ పోతన్న, విజేస్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మహారాజ్ సంస్థ కృషి అభినందనీయం

కుభీర్: నరేంద్ర మహరాజ్ సంస్థ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని గోడాపూర్‌లో నరేంద్ర మహరాజ్ అనుయాయులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 90 మంది రక్తదానం చేశారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, మాజీ కోఆప్షన్ మెంబర్ దత్తాహరి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బండి నడిపితే యజమానిపై కేసు



అవగాహన కల్పిస్తున్న సీఐ నవీన్‌కుమార్

సోన్ : మైనర్లు బండి నడిపితే యజమానిపై కేసు నమోదు చేస్తామని సీఐ నవీన్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా న్యూ వెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న రచించిన నరశతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై గోపి, ప్రధానోపాధ్యాయులు నా లం విద్యాసాగర్, ఇరు గ్రామాల ప్రత్యేక అధికారి రాజమల్లు, కార్యదర్శి భూపాల్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రొడ్డ రాజేశ్వర్, కోశాధికారి గంగాధర్ పాల్గొన్నారు.

మామడ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ నవీన్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు అలవర్చుకోవాలి

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థి దశనుంచే రోడ్డు భద్రత నియమాలను అలవర్చుకోవాలని రవాణా శాఖ అధికారి మహ్మద్ ముర్తుజా అలీ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విజేత ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎమ్‌వీఐలు కే.అక్షయ్, సిహెచ్ రజినీకాంత్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిర్ణీత వయస్సు వచ్చిన తర్వాతే వాహనాలు డ్రైవింగ్ చేయాలన్నారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎల్లయ్య వారిని సన్మానించారు.

కలవరం వద్దు..అప్రమత్తతే ముద్దు

- హెచ్‌ఎంపీవీ వైరస్‌పై నిర్మల్ కళాకారుడి విభిన్న ముగ్గు



శ్రావణ్ వేసిన రంగవల్లిక

నిర్మల్‌ఖిల్లా: హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా కేంద్రానికి చెందిన ఓ కళాకారుడు తనదైనశైలిలో చైతన్యవంతం చేస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన ఆర్టిస్టు అడ్డిగ శ్రావణ్ నూతన సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో తనదైన శైలిలో రంగవల్లులు వేస్తున్నాడు. ఇందులో అందరికీ భిన్నంగా ప్రజలను చైతన్యవంతం చేసే ముగ్గులను వేస్తూ సామాజిక మాధ్యమాల్లో అవగాహన కల్పిస్తున్నాడు. హెచ్‌ఎంపీవీ, నోరో వైరస్‌ల పట్ల ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలంటూ తనదైన శైలిలో వేసిన రంగవల్లిక పలువురిని ఆలోచింపజేసే విధంగా ఉండడంతో సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.

లింగాపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడెం: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఎన్నికల సిబ్బంది విధులను నిర్వహించి ఓటింగ్ జరిపించారు. ఎంఈవో షేక్ హుస్సేన్ సందర్శించి విద్యార్థులను అభినందించారు. మాక్ పోలింగ్ వల్ల ఎన్నికల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు మహేశ్వర్, అఖిల్ అంజుం, రాజమణి, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రమణారావు

నిర్మల్‌చైన్‌గేట్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ రమణారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లో ఓటీపీ కానీ బ్యాంక్ ఖాతా నంబర్లు కానీ, ఆధార్ నంబర్ కానీ పోలీసుల డీపీతో వచ్చిన కాల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దన్నారు. ఇలాంటివి ఎదురైనప్పుడు పోలీస్ శాఖకు లేదా 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఖానాపూర్: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. పట్టణంలోని మైనార్టీ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఓటీపీలు ఎవరికి చెప్పవద్దన్నారు.

నర్సాపూర్(జి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయి కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై జాగృతి దివాస్ అనే ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలన్నారు.

'అధికార గర్వంతో దాడులు సరికాదు'



నిరసన తెలుపుతున్న నాయకులు

భైంసాటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్నామనే గర్వంతో చిల్లర పనులు వేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక వ్యవస్థలను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా దాడిచేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

భైంసాటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ పట్టణ కమిటీ నాయకులు బుధవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి దాడులను సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శి భూకిరణ్, నాయకులు పోశెట్టి, భీంరావ్, వేణు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు భోజన్న, సుష్మరెడ్డి, వెంకటేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె విరమణ

భైంసాటౌన్: తమ డిమాండ్ల సాధనకు పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీలు వారంరోజులుగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో బుధవారం ఆందోళన విరమించారు. ఈ మేరకు విధుల్లో చేరారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బాపురావు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకుడు ముత్తన్న, హమాలీలు ఉన్నారు.

బీసీ అభ్యర్థులకే మద్దతు తెలపాలి

నిర్మల్‌చైన్‌గేట్: శాసన మండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులనే బలపర్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగం బీసీ కుటుంబాలకు చెందిన వారే ఉన్నారన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

కుంటాల: చైనా మాంజాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి హెచ్చరించారు. బుధవారం కుంటాలలో దుకాణాలను తనిఖీ చేశారు. రహస్యంగా తెచ్చి విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

జీపీ కార్మికుల కార్యవర్గం ఎన్నిక

కడెం: గ్రామ పంచాయతీ కార్మికుల (ఐఎఫ్‌టీయూ అనుబంధం) మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సునారికారి రాజేశ్, అధ్యక్షుడిగా గొర్రె నరేశ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, అశ్రఫ్, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు రాజన్న, సహాయ కార్యదర్శులుగా గణపతి, దినేశ్, కోశాధికారిగా కొమురయ్య, సలహాదారులుగా రాజేందర్, రాజన్న, సాంబయ్య, భూమన్న, తదితరులను ఎన్నుకున్నారు.

అధికలోడ్‌తో కాలుతున్న మోటర్లు

కుభీర్: అధికలోడ్‌తో మండల కేంద్రంలోని పలు వ్యవసాయ మోటర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రాజురా, చొండి, గొడ్సర గ్రామాలకు ఇంతకు ముందు సొనారి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. ఇటీవల కుభీర్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేస్తున్నారు. దీంతో లోడ్ ఎక్కువై శంబులింగ, భోజన్న, చిన్నన్నలకు చెందిన వ్యవసాయ మోటర్లతో పాటు మరి కొంతమంది రైతుల మోటర్లు కాలిపోయాయని వారు పేర్కొన్నారు. పలుమార్లు ట్రిప్పుకావడంతోనే కాలిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ ఆదిత్యనాథ్‌ను వివరణ కోరగా లోడ్ ఎక్కువవుతున్న మాట వాస్తవమేనని, కానీ మోటర్లు కాలిపోయిన విషయం తన దృష్టికి రాలేదన్నారు.

విద్యార్థుల పొలంబాట



వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

సోన్: మండల కేంద్రంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పొలంబాట పట్టారు. రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయ పనులకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించడానికి పొలం బాట పట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌బాబు మంగమ్మ, రాధ, విజయ, వాణి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

కుభీర్: మండల కేంద్రానికి చెందిన 75 మంది అయ్యప్ప స్వాములు బుధవారం ఇరుముడులు కట్టుకుని వాహనాల్లో శబరిమలకు తరలివెళ్లారు.

హెచ్‌ఎంపై దాడి అమానుషం

తానూరు: నిర్మల్‌లోని వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గజ్జారాంపై దాడి అమానుషమని ఎస్టీయూటీఎస్ జిల్లా అ ధ్యక్షుడు భూమన్నయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగానూ ఐదోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఫిబ్రవరి 1 వరకు రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఖానాపూర్:పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పలు రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న తెలిపారు. ఎంటీయూ 1010 రకం 25 కేజీల బస్తా రూ.995, ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకం 25 కేజీల బస్తా రూ.1094, కేఎస్‌ఎమ్–1638 రకం 15 కేజీల ధర రూ.610, 25 కేజీల బస్తా ధర రూ.1020 కు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తానూరు: బాసర సబ్ డివిజన్ పరిధిలోని తానూరు, ముధోల్, బాసర, లోకేశ్వరం మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యలపై తానూరు మండల కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో ఈ నెల 10న పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ ప్రదీప్ జాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యూరియా అధికంగా వాడొద్దు



మొక్కజొన్న పంట వద్ద రైతులతో ఏవో

సోన్: యూరియా అధికంగా వాడవద్దని ఏవో వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లోకల్ వెల్మల్‌లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సరైన మోతాదులోనే యూరియా వాడాలని సూచించారు. అనంతరం వరి నారుమళ్లను పరిశీలించారు. చలి ప్రభావం వల్ల అక్కడక్కడ చీడపీడలు ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వర్, గంగాధర్, నవీన్, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో నూతన వాటర్ ట్యాంక్ మంజూరయ్యేలా కృషి చేయాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన 90 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ ఎంపీపీ నరేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.